
ప్రజాశక్తి



జనరల్ డ్యూటీ అటెండెంట్ మెరిట్ జాబితా విడుదల

ప్రజాశక్తి-కంటోన్మెంట్

ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, ప్రభుత్వ వైద్య కళాశాలలో 20 కేటగిరీలకు చెందిన 91 ఉద్యోగాల భర్తీలో భాగంగా జనరల్ డ్యూటీ అటెండెంట్ పోస్టుకు సంబంధించిన ప్రొవిజనల్ మెరిట్ జాబితాను ఆన్‌లైన్‌లో ఉంచినట్లు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.పద్మలీల ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబితాపై ఎవరికైనా ఏమైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే లిఖితపూర్వకంగా సరైన ఆధారాలతో తమకు అందజేయాలని సూచించారు. ఈ నెల 23 నుంచి 31 వరకు పని వేళల్లో అభ్యంతరాలను స్వీకరిస్తామని ప్రకటనలో తెలిపారు.

ఎట్టకేలకు ఖరీఫ్ ప్రారంభానికి ముందే వర్షాలు కురుస్తుండడంతో ఖరీఫ్ పంటల సాగుకు జిల్లా రైతులు, అటు అధికారులు సన్నద్ధమౌతున్నారు. ఓవైపు ఎండలు దంచిగా కాస్తున్నప్పటికీ, మరోవైపు వర్షాలు కూడా కురుస్తుండడం వల్ల భూమి చల్లబడుతోంది. ఈనేపధ్యంలో రైతులు పొడిదుక్కులకు సిద్ధమౌతున్నారు. మరోవైపు అధికారులు పంటలవారిగా సాధారణ విస్తీర్ణం, ప్రస్తుత పరిస్థితులను బట్టి పంటల వారీ లక్ష్యాలను నిర్దేశించుకోవడం, అందుకనుగుణంగా విత్తనాలు, ఎరువుల అవసరాలను గుర్తిస్తున్నారు. దాదాపు ఖరీఫ్ ప్రణాళికను సిద్ధం చేశారు. గత ఏడాదితో పోలిస్తే పంటల సాగు స్వల్పంగా పెరిగే అవకాశం ఉన్నట్లుగా అధికారులు ప్రాథమిక అంచనాలు రూపొందించారు.



- దుక్కుల హడావుడిలో రైతులు
- ప్రణాళిక రూపకల్పనలో అధికారులు
- స్వల్పంగా పెరగనున్న సాగు విస్తీర్ణం

ఖరీఫ్ సన్నద్ధత

20 మండలాల్లో సాధారణ వర్షం.. ఏడు మండలాల్లో అధికం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

గత ఏడాది అన్ని పంటలూ కలుపుకుని 2,88,655 ఎకరాల విస్తీర్ణంలో సాగయ్యాయి. ఈ ఏడాది మే నుంచే వర్షాలు కురుస్తుండడం, వాతావరణం చల్లబడుతుండడంతో 2.92,483 ఎకరాల్లో పంటల సాగు ఉండవచ్చని ఇప్పటికే వ్యవసాయ శాఖ గణాంకాలు రూపొందించింది. ఇందులో ప్రధానంగా వరి సాగు పెరుగుతుందనే ఆశాభావం వ్యక్తమౌతోంది. గత ఏడాది వరి 2,25,145 ఎకరాల్లో సాగయ్యింది. ఈ ఏడాది సాధారణ విస్తీర్ణం 2,28,035 కాగా, 2,43,625 ఎకరాల వరకు సాగవ్వచ్చని అధికారులు అంచనాలు రూపొందించారు. దీన్నిబట్టి 15,540 ఎకరాల మేర వరి అధికంగా సాగవ్వాల్సివుంది. మిగిలిన పంటలు కూడా సాధారణ విస్తీర్ణానికి అనుగుణంగానే సాగవుతాయని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. అధికారిక అంచనాల ప్రకారం వరి తరువాత అంతటి కీలకమైన మొక్కజొన్న 30,965 ఎకరాల్లోనూ, చెరకు 11,800 ఎకరాల్లోనూ, నువ్వులు 13,962 ఎకరాల్లోనూ సాగవుతాయి. పత్తి 5,355 ఎకరాల్లోనూ, వేరుశనగ 923ఎకరాల్లోనూ, జ్యూట్ 765ఎకరాలు, మినుములు 923 ఎకరాలు, పెసలు 165ఎకరాలు, పెసలు 28 ఎకరాల్లోనూ సాగుకానున్నాయి. మిగిలిన పంటలు కూడా సాధారణ విస్తీర్ణానికి అనుగుణంగా సాగవుతాయని ఆశాభావం వ్యక్తమౌతోంది.

11 రకాల విత్తనాలకు ప్రోత్సాహం

భూసారం, నీటి వసతిని బట్టి ఈ ఏడాది జిల్లాలో మొత్తంగా 11రకాల వరి విత్తనాలను ప్రోత్సహిస్తున్నట్టు వ్యవసాయ శాఖ చెబుతోంది. ఇందుకోసం 50,010 క్వింటాళ్లు అవసరం కానుంది. ఇందులో అత్యధికంగా ఎంటియు -1121 రకాన్ని అధికారులు ఎక్కువగా ప్రోత్సహిస్తున్నారు. ఈనేపథ్యంలో 38క్వింటాళ్లు అవసరం కాగా, ఇప్పటికే జిల్లాలో 3176క్వింటాళ్లు సిద్ధంగా ఉన్నాయని చెబుతున్నారు. బిపిటి -3291, బిపిటి 5204 రకాలు రెండో ప్రధానంగా ఉన్నాయి. ఈ రెండు రకాల విత్తనాలూ 2,500 క్వింటాళ్ల చొప్పున అవసరం కానున్నాయి. మూడో ప్రధానంగా ఎంటియు - 1064, ఎంటియు -7029 రకాలు ఉన్నాయి. ఇందులో ఎంటియు -1064 రకానికి 2,200 క్వింటాళ్లు, ఎంటియు 7029 రకానికి 2000 క్వింటాళ్లు అవసరం కానున్నట్టు అధికారులు ప్రణాళిక రూపొందించారు. ఎంటియు -1224 రకం 1650క్వింటాళ్లు, ఎన్‌ఎల్‌ఆర్ -34449 రకం 50క్వింటాళ్లు, జిఎల్‌ఆర్ -2537 రకం 200క్వింటాళ్లు, ఆర్‌ఎన్‌ఎల్ 15048 రకం 50క్వింటాళ్లు చొప్పున అవసరం కానున్నట్టు అధికారులు నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి నివేదించేందుకు సిద్ధంగా ఉన్నారు. అపరాలు, రాగులు, నువ్వుల వంటి పంటలకు కూడా సాగు విస్తీర్ణాన్ని బట్టి విత్తనాల అవసరాన్ని గుర్తించినట్టు చెబుతున్నారు. ఇంకా ఎరువుల అవసరాన్ని కూడా గుర్తించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపే పనిలో అధికార యంత్రాంగం నిమగ్నమైంది.

మే నెల అంటే తీవ్రమైన, ఎండ, ఉక్కపోత వంటివి గుర్తుకు వస్తాయి. వ్యవసాయ భూములు బీటలు వారుతాయి. కానీ, ఈ ఏడాది మే నెలలోనే ఇప్పటి వరకు 10రోజులపాటు వర్షపాతం నమోదైంది. ఈనేపథ్యంలో మొత్తం 27 మండలాలకుగాను 20 మండలాల్లో సాధారణ వర్షపాతం, 7 మండలాల్లో అధిక వర్షపాతం నమోదైంది. ఈనేపథ్యంలో భూమి చల్లబడడం వల్ల ట్రాక్టర్లు, నాగళ్లతో పొడిదుక్కులు వేసేందుకు రైతులు సన్నద్ధమౌతున్నారు. రైతుల సన్నద్ధత నేపథ్యంలో సాగు విస్తీర్ణానికి అనుగుణంగా విత్తనాలు ఎంపిక, నిల్వ, ఎరువుల తదితరాలపై దృష్టిపెట్టామని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

నిర్మాణాలు చేపట్టకుంటే

ఇళ్ల స్థలాలు స్వాధీనం

ఆ స్థలాలు మరొకరికి కేటాయిస్తాం : గృహనిర్మాణ సంస్థ జిఎం వెంకటరమణ

ప్రజాశక్తి-విలేకర్ల బృందం

గృహనిర్మాణ పథకాల కింద గతంలో ఇంటి స్థలాలు, ఇళ్లు మంజూరై నిర్మాణాలు నేటికీ చేపట్టని లబ్ధిదారులంతా వెంటనే ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలని రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ జనరల్ మేనేజర్ (ఫైనాన్స్) వెంకటరమణ సూచించారు. ప్రభుత్వం మంజూరు చేసిన అదనపు సహాయాన్ని వినియోగించుకొని ఆయా ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేసుకోవాలని, లేకుంటే ఆ ఇళ్ల స్థలాలు వారి నుంచి స్వాధీనం చేసుకొని కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి కేటాయిస్తామని స్పష్టంచేశారు. జిల్లాలో గృహనిర్మాణాల పురోగతిని పరిశీలించే నిమిత్తం శుక్రవారం పలు మండలాల్లో ఆయన పర్యటించారు. నెల్లిమర్ల మండలం సీతారాంపేట, బొండపల్లి మండలం గొట్లాం, బొబ్బిలి మండలం పారాదిలో ఇళ్ల కాలనీలను సందర్శించి, ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న అదనపు ఆర్థిక సహాయాన్ని వినియోగించుకొని ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలని సూచించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని హౌసింగ్ కార్యాలయంలో జిల్లాలోని హౌసింగ్ ఇఇ, డిఇలు, ఎఇలతో గృహనిర్మాణ ప్రగతిపై సమీక్షించారు. ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. నిర్మాణాలకు ఈ సీజన్ అనుకూలంగా ఉన్నందున లబ్ధిదారులతో అధికారులు నేరుగా మాట్లాడి, వారికి ఇళ్ల నిర్మాణంలో ఎదురయ్యే ఇబ్బందులు తొలగించాలని సూచించారు. జిల్లాలో 11,648 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలన్నది లక్ష్యం కాగా ఇప్పటికే 4,649 ఇళ్లు పూర్తిచేశారని తెలిపారు. మిగిలిన 6,999 ఇళ్ల నిర్మాణాన్ని జూన్ పదో తేదీకి పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట పర్యటనలో గృహనిర్మాణ సంస్థ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ జి.మురళీమోహన్, ఇతర అధికారులు ఉన్నారు.



లబ్ధిదారులతో మాట్లాడుతున్న హౌసింగ్ జిఎం వెంకటరమణ

ఉపాధి బకాయిలు చెల్లించాలని

మట్టిని తింటూ నిరసన

ప్రజాశక్తి-శృంగవరపుకోట

ఉపాధి కూలీలకు బకాయిలు చెల్లించాలని శుక్రవారం మండలంలోని కిల్తంపాలెం పంచాయతీ పరిధిలో వాకాడ చెరువులో వ్యవసాయ కార్మిక సంఘం, సిఐటియు ఆధ్వర్యాన నిరసన చేపట్టారు. వినూత్నరీతిలో మట్టిని తింటూ కూలీలు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి జి.అప్పారావు, సిఐటియు జిల్లా నాయకులు మద్దిల రమణ మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్రం కుట్ర పన్నుతోందని విమర్శించారు. ఎన్‌ఎంఎంఎస్ యాప్ తీసుకురావడం, రెండు పూటలా పనిపెట్టడం, సకాలంలో బిల్లులు చెల్లించకుండా పనులు చేయించడం అందులో భాగమేనని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఉపాధి హామీ కూలీలకు చట్టప్రకారం పనిచేసిన 15 రోజుల్లో పేమెంట్లు చెల్లించాల్సి ఉందన్నారు. ఇప్పటికి ఏడు నుంచి తొమ్మిది వారాలు బిల్లులు చెల్లించకుండా కార్మికులతో వెట్టిచాకిరీ చేయించుకుంటోందని మండిపడ్డారు. టిడిపి కూటమి ప్రభుత్వం ఉపాధి మేట్లకు నెలకు 7500 జీతం ఇస్తానని హామీ ఇచ్చి గాలికొదిలేసిందని ధ్వజమెత్తారు. తక్షణమే ఉపాధిహామీ కూలీలందరికీ బకాయి బిల్లులు చెల్లించాలని డిమాండ్‌చేశారు. వేసవి అలవెన్స్‌తోపాటు తాగునీరు, గునపాం, పార, తట్టకు అలవెన్స్ ఇవ్వాలని కోరారు. ఉపాధి హామీ నిధులు దారిమళ్లించవద్దన్నారు. ఉపాధి హామీ నిధులను రోడ్లు, డ్రెయిన్లు, ప్రభుత్వ భవనాలకు, ఇతర పనులకు వినియోగించరాదని డిమాండ్‌చేశారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి ఏడాదిలో 200 రోజులు పని కల్పించాలని, రోజు కూలి 600 రూపాయలు చెల్లించాలని కోరారు. కూలీలను కార్మిక సంక్షేమ బోర్డులో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ వీర్రాజు, బి.నాగరాజు, కె.సన్యాసమ్మ, వి.గణేష్, ఎస్.రామనాయుడు, పి.లక్ష్మి, ఎస్.చందర్రావు, ఎస్.గౌరి, వి.దేవుడమ్మ, ఎస్.భారతి, ఎస్.కొండమ్మ, పి.చిన్నతల్లి, బి.పోలమ్మ, తదితరులు పాల్గొన్నారు.



మట్టిని తింటూ నిరసన తెలుపుతున్న ఉపాధి కూలీలు

వైసిపి సర్పంచ్‌పై జనసేన కార్యకర్తల దాడి

ప్రజాశక్తి-నెల్లిమర్ల

మండలంలోని కొత్తపేట సర్పంచ్ అట్టాడ శ్రీనుపై జనసేన కార్యకర్తలు దాడికి పాల్పడ్డారు. గాయపడిన ఆయన విజయనగరంలో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై ఇరువురు పరస్పరం పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం...

మండలంలోని కొత్తవలస గ్రామంలోని జగ్గయ్య చెరువు నుంచి మట్టిని వైసిపి సర్పంచ్ అట్టాడ శ్రీను ట్రాక్టర్‌తో తరలిస్తున్నారు. ఆ సమయంలో జనసేన కార్యకర్తలు సువ్వాని రమణ, గురాన గోవింద, కళ్యాణం లోకేష్, పంచాది రమణ అడ్డుకున్నారు. ఈ వివాదం ఘర్షణకు దారితీసింది. సర్పంచ్, జనసేన కార్యకర్తలు కొట్టుకోవడంతో శ్రీనుకు తీవ్రగాయాలయ్యాయి. దీంతో సర్పంచ్ శ్రీను విజయనగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. జనసేన కార్యకర్తలు కూడా నెల్లిమర్ల మిమ్స్‌లో చేరినట్లు తెలిసింది.



గాయపడిన సర్పంచ్ శ్రీను

మట్టి తరలింపే వివాదానికి కారణం

కొత్తపేట సర్పంచ్‌పై దాడికి మట్టి తరలింపు కారణంగా తెలుస్తోంది. గ్రామ పరిధిలో సువ్వానిపేట చెరువు, జగ్గయ్య చెరువు నుంచి మట్టి తరలించి అమ్మకాలు జరపడం వివాదానికి కారణమైనట్లు సమాచారం. గతంలో జనసేన కార్యకర్తలు సువ్వానిచెరువులో మట్టి తరలించారు. సర్పంచ్ కూడా చెరువుల్లో మట్టిని తరలించే వారు. టిడిపి కూటమి అధికారం చేపట్టిన తరువాత జనసేన కార్యకర్తలు ఆయా చెరువుల్లో అడ్డూ అదుపూ లేకుండా మట్టిని తరలించుకు పోతున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం జగ్గయ్య చెరువులో సర్పంచ్ అట్టాడ శ్రీను మట్టిని ట్రాక్టర్‌లో తరలిస్తుండగా వివాదం చోటుచేసుకుంది. మట్టి తరలింపుపై రెవెన్యూ సిబ్బంది చూసీచూడనట్లు వ్యవహరించడమే ఘర్షణకు కారణమైందని స్థానికులు చెబుతున్నారు.

సర్పంచ్ పై దాడి బాధాకరం : మాజీ ఎమ్మెల్యే

కొత్తపేట సర్పంచ్‌పై జనసేన కార్యకర్తలు దాడి చేసి గాయపర్చడం బాధాకరమని మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సర్పంచ్ అట్టాడ శ్రీనును ఆయన పరామర్శించారు. దశాబ్దాల నుంచి రాజకీయ జీవితంలో ఉన్నామని, కొట్లాడుకునే సంస్కృతికి ఎన్నడూ తావునివ్వలేదని చెప్పారు. ప్రశాంతంగా ఉండే నియోజకవర్గంలో ఇలాంటి ఘటనలు ఎన్నడూ చూడలేదన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచే ఈ విష సంస్కృతి ప్రారంభమైందన్నారు. పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించి దాడిచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి గదల సన్యాసినాయుడు, వైసిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి రేగాన శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఐసిడిఎస్‌లో ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూ

ప్రజాశక్తి-కంటోన్మెంట్

ఐసిడిఎస్‌లో రెండు ఉద్యోగాల భర్తీకి కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. వన్ స్టాఫ్ సెంటర్‌లో పారా లీగల్ పర్సనల్ -1, మల్టీ పర్పస్ స్టాఫ్ కమ్ కుక్-1 పోస్టుల భర్తీకి ఇటీవలే దరఖాస్తులను ఆహ్వానించారు. పారా లీగల్ పర్సనల్ పోస్టుకు ముగ్గురు, మల్టీ పర్పస్ స్టాఫ్‌కు 13 మంది దరఖాస్తు చేసుకున్నారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశాల మేరకు వీరికి ఇంటర్వ్యూ నిర్వహించారు. ఇంటర్వ్యూ బోర్డు సభ్యులైన సివిల్ సప్లయిస్ డిఎం బి.శాంతి, డిపిఒ టి.వెంకటేశ్వర్రావు, ఐసిడిఎస్ పీడీ రుక్సానా సుల్తానా బేగం, గిరిజన సంక్షేమాధికారి శ్రీనివాసరావు, డిఎంఅండ్‌హెచ్ఒ డాక్టర్ జీవనరాణి, మహిళా పోలీసుస్టేషన్ సిఐ నర్సింహమూర్తి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు రవికుమార్, చైతన్యభారతి, నేచర్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు అభ్యర్థులను ఇంటర్వ్యూ చేశారు. వన్‌స్టాఫ్ సెంటర్ ఇన్‌ఛార్జి పి.విజయలక్ష్మి, ఇతర సిబ్బంది వీరికి సహకరించారు.



సిఎం సహాయనిధి చెక్కు అందజేస్తున్న మంత్రి శ్రీనివాస్

సిఎం సహాయనిధి అందజేత

ప్రజాశక్తి-బొండపల్లి

మండలంలోని పలువురు లబ్ధిదారులకు సిఎం సహాయ నిధి నుండి మంజూరైన చెక్కులను మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అందజేశారు. ఈ మేరకు విజయనగరంలోని తన నివాసంలో కొండకిండాం గ్రామానికి చెందిన కొండపల్లి లక్ష్మి తోపాటు ఎం,కొత్తవలస, నెలివాడ మరువాడ, జిపి అగ్రహారానికి చెందిన పలువురికి సిఎం సహాయ నిధి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో కెరటాం సర్పంచ్ నంబూరి రాజేష్, కొండ కిండాం మాజీ సర్పంచ్ ముంజేటి పార్వతి, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు సనపతి శ్రీనివాస్, మాజీ ఉప సర్పంచ్ కోనపల్లి సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

11న మున్సిపల్ వైస్‌చైర్మన్‌పై అవిశ్వాసం

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలి మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ జి.రమాదేవిపై టిడిపి, వైసిపి అసమ్మతి కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాస తీర్మానంపై జూన్ 11న ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. వైస్ చైర్మన్ పదవిపై అవిశ్వాస తీర్మానం పెట్టడంతో ప్రత్యేక సమావేశం పెట్టి ఓటింగ్ నిర్వహించాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేయడంతో జూన్ 11న ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ప్రత్యేక సమావేశానికి హాజరు కావాలని ఎక్స్ అఫీషియో సభ్యులు బేబినాయన, కౌన్సిలర్లకు నోటీసులు జారీ చేశారు.

ఎల్‌ఆర్‌ఎస్, బిపిఎస్ దరఖాస్తులను పరిష్కరించాలి

కమిషనర్ నల్లనయ్య

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పెండింగ్‌లో ఉన్న ఎల్‌ఆర్‌ఎస్, బిపిఎస్ దరఖాస్తులను తక్షణమే పరిష్కరించేలా కృషి చేయాలని ప్రణాళికా సిబ్బందికి నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం కార్యాలయంలో నిర్వహించిన టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరం సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి క్రెడయ్ సంస్థ ప్రతినిధులు హాజరై టౌన్ ప్లానింగ్ కి సంబంధించి ప్రభుత్వం అమలు చేస్తున్న కొత్త జీఓలలో ఎదురైన అభ్యంతరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లాలని కమిషనర్‌ను కోరారు. చాలా కాలంగా పెండింగ్లో ఉన్న సమస్యలను సానుకూలంగా స్పందించి పరిష్కరించాలని కోరారు. మరి కొంతమంది టిడిఆర్ సమస్యలపై ప్రస్తావించారు. అనంతరం కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ ఎల్‌ఆర్‌ఎస్, బిపిఎస్ దరఖాస్తులను పరిష్కరించేందుకు ప్రభుత్వం మరో 3 నెలలు గడువు పొడిగించిందన్నారు. వ్యక్తిగత దరఖాస్తులను కూడా తక్షణమే పరిష్కరించేందుకు అవసరమైన చొరవ చూపాలన్నారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే ఇబ్బందులను తమ దృష్టికి తెచ్చినట్లయితే పరిష్కారమయ్యేలా చూస్తామన్నారు. సమావేశంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్లు హరిబాబు, రమణమూర్తి, టిపిఒ అప్పలరాజు, క్రెడయ్ సంస్థ జిల్లా అధ్యక్షులు సుభాష్ చంద్రబోస్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.



ఓపెన్ ఫోరంలో మాట్లాడుతున్న కమిషనర్ నల్లనయ్య

పిహెచ్‌సి ఏర్పాటుకు స్థల పరిశీలన చేయాలి

నగరంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు అవసరమైన స్థల పరిశీలనను కమిషనర్ పల్లి నల్లనయ్య పరిశీలించారు. శుక్రవారం క్షేత్రస్థాయి పర్యటన భాగంగా పారిశుధ్య విధానాలను గమనించిన అనంతరం జనతా బజారు ప్రాంతంలో ఉన్న నగరపాలక సంస్థకు చెందిన స్థలాన్ని పరిశీలించారు. అక్కడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటుకు అనువైన పరిస్థితిని గమనించారు. అన్న క్యాంటీన్ వద్ద క్రమబద్ధీకరణలో లేని తోపుడుబళ్ళను అక్కడ నుంచి తరలించి వేశారు. నగరంలో విచ్చలవిడిగా తోపుడుబళ్ళను ఎక్కడపడితే అక్కడ ఉంచరాదన్నారు. క్రమ పద్ధతిలో లేని తోపుడుబళ్లను తరలించి వేస్తామన్నారు.

వీధి విక్రయదారుల సర్వే శత శాతం పూర్తి చేయాలి

అందరి సమన్వయంతో వీధి విక్రయదారుల గుర్తింపు సర్వే ప్రక్రియ శతశాతం పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య సచివాలయ కార్యదర్శులకు ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంతవరకు వీధివిక్రయదారుల గుర్తింపు ప్రక్రియ ఏ విధంగా సాగుతుందో వివరాలు అడిగి తెలుసుకున్నారు. అయితే కొన్ని సాంకేతిక సమస్యల వలన ఇబ్బందులు తలెత్తుతున్నాయని కార్యదర్శులు సమావేశం దృష్టికి తెచ్చారు. ఈ విషయమై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి సమస్యను పరిష్కరించిందని, కావున ఇక నుండి ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. సమావేశంలో టిపిఆర్ఓ సింహాచలం,సిటీ మిషన్ మేనేజర్ సన్యాసిరావు, కమ్యూనిటీ ఆర్గనైజర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రజాదర్బార్



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదితి

ప్రజాశక్తి- కంటోన్మెంట్

ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు స్థానిక అశోక్ బంగ్లాలో శుక్రవారం ప్రజల నుండి వచ్చిన పలు ఫిర్యాదులు, వినతులను స్వీకరించేందుకు ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుండి వచ్చిన పింఛన్లు, హౌసింగ్, రోడ్లు, కాలువలు, వీధి దీపాలు, విద్యుత్ వంటి అనేక అంశాలపై వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల నుండి వచ్చిన వినతులను సంబంధిత అధికారులకు పరిష్కారం నిమిత్తం పంపిస్తామని తెలిపారు.

పొదుపు సంఘాల్లో అక్రమాలపై దర్యాప్తు

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

పొదుపు సంఘాల్లో విఒఎ అక్రమాలకు పాల్పడ్డారని గ్రామస్తుల ఫిర్యాదు మేరకు డిఆర్‌డిఎ పీడీ స్పందించి శుక్రవారం అలజంగి గ్రామంలో సిబ్బందితో దర్యాప్తు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరియా కోఆర్డినేటర్ ఆదయ్య మాట్లాడుతూ గ్రామంలో 108 సంఘాలకు గాను 42 సంఘాల్లో అక్రమాలు జరిగినట్లు ఫిర్యాదు అందిందని చెప్పారు. గతంలో 13 సంఘాలకు దర్యాప్తు చేపట్టామని, శుక్రవారం మరో 6 సంఘాలను దర్యాప్తు చేశామని వివరించారు. మిగిలిన సంఘాలను విచారించి, నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బొబ్బిలి ఎపిఎం భాగ్యలక్ష్మి, ఎపిఎంలు దేవుడుబాబు , హేమలత, శేషగిరి, రమేశ్, సిసిలు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి నిర్ణయాన్ని పునఃపరిశీలించాలి

ప్రజాశక్తి- కంటోన్మెంట్

జిల్లా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిని ఉన్నచోటే కొనసాగించాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధికారులకు సూచించడం సరికాదని జిల్లా పౌరవేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి అన్నారు శుక్రవారం పౌర వేదిక కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ పౌర వేదిక ఆధ్వర్యంలో గత ఏడాది నవంబర్ 28,29,30,తేదీల్లో మూడు రోజుల పాటు జిల్లా సర్వజన ఆసుపత్రి లో రోగులు, వారి బంధువులు, డాక్టర్లు, సిబ్బంది తో సమావేశమై ఆసుపత్రిలో ని పరిస్థితులపై ఒక నివేదిక తయారు చేసి జిల్లా సర్వజన ఆసుపత్రిని ప్రభుత్వ వైద్యకళాశాలకు వెంటనే తరలించాలని కోరుతూ అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతులు ఇచ్చామని తెలిపారు. రోగులు, డాక్టర్లు, సిబ్బంది వసతులు చాలక ఇబ్బందులు పడుతున్నామని గగ్గోలు పెడుతుంటే మంత్రి ఉన్నచోటే ఆసుపత్రి ని ఉంచాలని ఎలా చెబుతున్నారని ప్రశ్నించారు. వైద్య విద్యార్థులు బోధనాసుపత్రి నుండి ప్రతిరోజూ సర్వజన ఆసుపత్రికి వచ్చి వెళ్ళడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నందున మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తన నిర్ణయాన్ని పునఃరాలోచించి ప్రస్తుతం ఉన్న ఆసుపత్రిలో న్యూరో, న్యూరోమెడిసన్, నెఫ్రాలజీ,యూరాలజీ, మెడికల్ అంకాలజీ లతో కూడిన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని ఏర్పాటు చెయ్యాలని భీశెట్టి డిమాండ్ చేశారు, సమావేశంలో పౌర వేదిక ప్రతినిధులు జలంత్రి రామచంద్రరాజు,తుమ్మగంటి రామ్మోహన్ రావు, గో సంరక్షణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు లోగిస రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు పరిశీలన

ప్రజాశక్తి-భోగాపురం

మండలంలోని భోగాపురం, చాకివలస పంచాయతీల్లో చేపడుతున్న ఉపాధి హామీ పనులను డ్వామా పీడీ ఎస్.శారదా దేవి శుక్రవారం పరిశీలించారు. భోగాపురంలో జగ్గుబట్ల చెరువు వద్ద జరుగుతున్న పనులు పరిశీలించి ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. ప్రతి ఒక్కరికీ రూ.307 కూలి వచ్చే విధంగా పని చేయాలని తెలిపారు. అనంతరం చాకివలస గ్రామంలో ఫారం పాండ్స్ పనులను సైతం పరిశీలించారు. రైతులు వీటిని ఉపయోగించు కుంటే ఎంతో మేలని అన్నారు. కార్యక్రమంలో ఎపిఒ భాగ్యలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.



ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న పీడీ శారదా దేవి



కాలువను పరిశీలిస్తున్న కమిషనర్ రామలక్ష్మి

మురుగునీరు నిల్వ లేకుండా చర్యలు

ప్రజాశక్తి-బొబ్బిలి

కాలువల్లో మురుగునీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి. శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళిని ఆదేశించారు. పట్టణంలోని వేదరబంద జంక్షన్, మార్కెట్ రోడ్డు, దేవాంగులవీధి ప్రాంతాల్లో శుక్రవారం పారిశుద్య పనులను పరిశీలించారు. వర్షాల విస్తారంగా కురవడంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, కాలువల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని ఆదేశించారు. కాలువల్లో పూడికలు తొలగించాలన్నారు. రోడ్లు, కాలువలు శుభ్రం ఉంచాలని చెప్పారు.

'వరలక్ష్మి' విద్యార్థుల ప్రభంజనం

ప్రజాశక్తి-శృంగవరపుకోట

సైనిక్ స్కూల్ ఆరో తరగతి ప్రవేశ పరీక్షల్లో డాక్టర్ వరలక్ష్మి పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. 12 మంది రాతపరీక్షల్లో అర్హత సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపల్ వై.జానకీదేవి తెలిపారు. అర్హత సాధించిన విద్యార్థులను యాజమాన్య ప్రతినిధులు కొలపర్తి రాజేంద్ర ప్రసాద్, డాక్టర్ వరలక్ష్మి, ప్రిన్సిపల్ అభినందించారు.

టిడిపి పట్టణ అధ్యక్షులుగా గవిడి

ప్రజాశక్తి -చీపురుపల్లి

టిడిపి చీపురుపల్లి పట్టణ అధ్యక్షులుగా గవిడి నాగరాజు నియమితులయ్యారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయం నుంచి నాగరాజుకు ఉత్తర్వులు అందాయి. నాగరాజు 1995 నుంచి పార్టీలో వివిధ పదవులను అలంకరించారు. చీపురుపల్లి పంచాయతీలో వార్డు మెంబర్ గాను, నాగరాజు భార్య ఎంపిటిసి గాను గెలుపొందారు. నాగరాజు రెండోసారి పట్టణాధ్యక్షులుగా ఎంపికవడంతో టిడిపి కార్యకర్తలు, నాయకులు అభినందనలు తెలిపారు.



గవిడి నాగరాజు

ఉత్తమ ప్రతిభకు అభినందన

ప్రజాశక్తి-గజపతినగరం

ఫిబ్రవరిలో నిర్వహించిన పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ మేళాలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి శుక్రవారం విజయనగరం డివిజన్ కార్యాలయంలో బహుమతులు అందజేశారు. గజపతినగరం పోస్టల్ సబ్ డివిజన్‌కు చెందిన బీమా వారియర్ టి.ఉపేంద్రను సూపరింటెండెంట్ కె.శ్రీనివాసు ఈ సందర్భంగా అభినందించారు. సర్కిల్ స్థాయిలో జరిగిన ఈ మేళాలో ఉపేంద్ర అత్యధిక ప్రీమియం చేశారు. తమ సబ్ డివిజన్‌కి అవార్డు రావడం పట్ల గజపతినగరం పోస్టల్ ఇన్‌స్పెక్టర్ బొద్దుల ఉపేంద్ర హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సూపరింటెండెంట్ మధుసూదనరావు, పోస్టల్ ఇన్‌స్పెక్టర్ కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

సిహెచ్‌సిని తనిఖీ చేసిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-బొబ్బిలి

స్థానిక సిహెచ్‌సిని ఎమ్మెల్యే బేబినాయన శుక్రవారం తనిఖీ చేశారు. ప్రభుత్వం వైద్య రంగానికి ప్రాధాన్యత ఇస్తుందని, రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని కోరారు. ఆసుపత్రిలో ఉన్న పాత భవనాన్ని పరిశీలించి బాగు చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. సూపరింటెండెంట్ జి.శశిభూషణరావు, వైద్యులతో మాట్లాడి వైద్య సౌకర్యాలు, రోగులకు అందుతున్న వైద్యం అడిగి తెలుసుకున్నారు. బెడ్స్ తక్కువ ఉండడం వలన ఇబ్బందులు పడుతున్నామని, 100 పడకల ఆసుపత్రిగా అప్ గ్రేడ్ చేస్తే మంచిదని వైద్యాధికారి చెప్పగా ఆదిశగా చర్యలు తీసుకుంటామన్నారు.

నారీశక్తి కింద డ్వాక్రా మహిళలకు రుణాలు

ప్రజాశక్తి-రామభద్రపురం

డ్వాక్రా మహిళలకు నారీ శక్తి పథకం కింద కొత్తగా రుణాలు మంజూరు చేస్తున్నామని వెలుగు ఎపిఎం అన్నపూర్ణ తెలిపారు. మండల వెలుగు కార్యాలయంలో శుక్రవారం ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్న ఉద్దేశంతో ఈ పథకం రూపొందించిందని తెలిపారు. దీని కోసం మండలంలో 54 మంది డ్వాక్రా మహిళలను గుర్తించామని, వీరికి బ్యాంకర్ల ద్వారా రుణాలు మంజూరు చేయనున్నామని తెలిపారు. గ్రూపులతో సంబంధం లేకుండా వ్యక్తిగతంగా మహిళలు ఆర్థికంగా అభివద్ధి చెందాలన్నదే ఈ పథకం ఉద్దేశమన్నారు.

పెండింగ్ డిఎలు విడుదల చేయాలి

ప్రజాశక్తి-రామభద్రపురం

ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఎన్నోఏళ్లగా ఎదురుచూస్తున్న పెండింగ్ డిఎలు తక్షణమే విడుదల చేయాలని ఎపిటిఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు బొప్పే రవికుమార్ డిమాండ్ చేశారు. ఆయన విలేకర్లతో మాట్లాడుతూ యుపి స్కూల్లో తెలుగు, హిందీ పండిట్లు నియామకం చేపట్టకపోవడంతో తెలుగుపై విద్యార్థులు పట్టుకోల్పోతున్నారని, దీనివలన పిల్లలకు ఎంతో అన్యాయం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి పాఠశాలలో తెలుగు, హిందీ పోస్టులు భర్తీ చేయాలని కోరారు.

డెంకాడకే ఎఎంసి చైర్మన్?

ప్రజాశక్తి-డెంకాడ

నెల్లిమర్ల నియోజకవర్గ పరిధిలోని పూసపాటిరేగ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని ఈసారి డెంకాడ మండలానికి కేటాయించే అవకాశం ఉందా? త్వరలో దీనిపై అధికారకంగా ప్రకటన రానుందా? అంటే అవుననే చెబుతోంది టిడిపిలోని ఒక గ్రూపు. రాష్ట్రంలో దాదాపు అన్ని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవులను ప్రభుత్వం ప్రకటించింది. కానీ, నెల్లిమర్ల నియోజకవర్గంలో జనసేన ఎమ్మెల్యే ఉండడం, టిడిపిలో రెండు గ్రూపులు కావడంతో ఎఎంసి చైర్మన్ పదవిని ప్రభుత్వం ప్రకటించలేదు. జనసేన పార్టీకి ఎఎంసి చైర్మన్ పదవిని కేటాయించాలని, తమ పార్టీలో ఇద్దరు ముగ్గురు రేసులో ఉన్నా పూసపాటిరేగ మండలానికి చెందిన ఒక వ్యక్తి పేరు ఎమ్మెల్యే సిఫార్సు చేసినట్లు తెలిసింది.

నాలుగు మండలాల్లోని టిడిపి నాయకులు రెండు గ్రూపులుగా విడిపోయి, పూసపాటిరేగలో ఇద్దరు, నెల్లిమర్లలో ఒకరు, భోగాపురంలో ఒకరు, డెంకాడలో ఒకరు.. ఎఎంసి చైర్మన్ పదవి కోసం ఎవరు ప్రయత్నాలు వారు చేశారు. చైర్మన్ పదవి ఫైనల్ కాకపోవడంతో దీనికి సంబంధించిన డైరెక్టర్ల పేర్లు ఎవరూ ప్రభుత్వానికి పంపలేదు. దీంతో ఇక్కడ చైర్మన్ పదవిని ప్రభుత్వం ప్రకటించలేదు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కర్రోతు బంగార్రాజు.. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి బిసి మహిళకు ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి లోకేష్‌కు లేఖ రాశారు. దీంతో నియోజకవర్గంలో ఉన్న నాలుగు మండలాల్లో బిసి మహిళలు తెరపైకి వచ్చారు. డెంకాడ మండలం నుంచి మాజీ ఎంపిటిసి పేరును టిడిపిలో ఒక గ్రూపు ప్రతిపాదించగా, మరో గ్రూపు ఆమెపై ముఖ్యమంత్రి చంద్రబాబుకు, మంత్రి లోకేష్‌కు ఫిర్యాదు చేసింది. అక్కడతో ఆమె పేరు పరిశీలన నుంచి తీసేశారు. దీంతో ఇదే మండలానికి చెందిన గతసారి స్థానిక సంస్థల ఎన్నికల్లో జెడ్‌పిటిసిగా పోటీ చేసిన మహిళకు ఎఎంసి చైర్మన్ పదవి కేటాయించినట్లు టిడిపి నాయకులు, కార్యకర్తలు గుసగుసలు ఆడుకుంటున్నారు. రెండు మూడు రోజుల్లో పేరు ప్రకటించడం ఖాయమని ఆ నాయకులే చెబుతున్నారు. ఇప్పుడు ఈ పదవిని ప్రకటించకపోతే మహానాడు తరువాత ప్రకటిస్తారని అంటున్నారు. ఏదేమైనా డెంకాడ మండలానికి చెందిన మహిళకు పూసపాటిరేగ ఎఎంసి చైర్మన్ పదవి రావడం ఖాయమని ఘంటాపథంగా చెబుతున్నారు.



పూసపాటిరేగ ఎఎంసి కార్యాలయం

త్వరలో ప్రకటించే అవకాశం

మరోవైపు ఇప్పటివరకు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి పూసపాటిరేగ, భోగాపురం మండలాల వారికే ఇచ్చేవారు. డెంకాడ మండలానికి ఒక్కసారి కూడా చైర్మన్ పదవిని ఏ ప్రభుత్వంలోనూ ఇవ్వలేదు. కానీ ఇప్పుడు డెంకాడ మండలానికి ఎఎంసి చైర్మన్ పదవి ఇస్తారని తెలియడంతో మండలానికి చెందిన టిడిపి నాయకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా చైర్మన్ పదవి పేరు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటిస్తే ఆశావహుల్లో పదవి ఆశ పోతుందని, ఉత్కంఠకు తెరదించినట్లు అవుతుందని చెబుతున్నారు.



కాలువలో పడిన కారు

అదుపుతప్పి కారు బోల్తా

తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి-బొబ్బిలి

స్థానిక గ్రోత్ సెంటర్లో అదుపుతప్పి కారు బోల్తా పడింది. పట్టణానికి చెందిన బి.సాయికృష్ణ విజయనగరం నుంచి బొబ్బిలి వస్తుండగా గ్రోత్ సెంటర్ సమీపంలో కారు అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొని బోల్తా పడింది. గోతిలో కారు బోల్తా పడినప్పటికి కారులో ఉన్న నలుగురు సురక్షితంగా బయటపడడంతో స్థానికులు, కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు.

ఇక్కడ వృథా.. అక్కడ కటకట



వృథాగా పోతున్న నీరు

లీకులతో తాగునీరు వృథా

ప్రజాశక్తి-బొబ్బిలి

పట్టణంలోని స్టీల్ బజార్ సమీపంలో లీకులతో తాగునీరు వృథాగా పోతోంది. పైపులైన్ లీకులతో నీరు వృథా కావడంతో సంపూర్ణంగా తాగునీరు అందడం లేదని ప్రజలు వాపోతున్నారు. పైపులైన్ లీకులను నివారించి సంపూర్ణంగా తాగునీరు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

నిలిచిన తాగునీటి సరఫరా

ప్రజాశక్తి-భోగాపురం

భోగాపురం గ్రామంలో మూడు రోజుల నుంచి తాగునీటి సరఫరా నిలిచిపోయింది. నాతవలస సమీపంలోని చంపావతి నదిలోనున్న మోటారు పాడవడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని అధికారులు అంటున్నారు. గ్రామంలో రోజు విడిచి రోజు తాగు నీటిని సరఫరా చేస్తున్నారు. దీనిలో భాగంగా ట్యాంకుకు నీటి సరఫరా చేసే పంపింగ్ మోటారు నాతవలస వద్ద మరమ్మతులకు గురైంది. దీనివల్ల మూడు రోజుల నుంచి తాగునీటిని సరఫరా చేయడం లేదు. పర్యావసానంగా భోగాపురం గ్రామస్తులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. మరమ్మతులు చేసి వెంటనే తాగు నీటిని సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై గ్రామీణ నీటి సరఫరా విభాగం డిఇ వైకుంఠం నాయుడు మాట్లాడుతూ మోటార్ మరమ్మతులు గురైందన్నారు. గ్రామ పంచాయతీ ఇప్పటికే మరమ్మతులు చేయిస్తోందని తెలిపారు. మరమ్మతులు పూర్తయిన వెంటనే సరఫరా చేస్తామనితెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే బేబినాయన

ప్రజాశక్తి-బొబ్బిలి

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. స్థానిక కోటలో శుక్రవారం ఎమ్మెల్యే ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. టిడిపి పట్టణ అధ్యక్షులు గెంబలి శ్రీనివాసరావు, కౌన్సిలర్లతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.



అర్జీలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బేబినాయన

గ్రామీణ ప్రాంతాల్లో పెండింగ్ అభివృద్ధి పనులు పూర్తి చేయాలని పంచాయతీ రాజ్ డిఇ అప్పారావును ఎమ్మెల్యే ఆదేశించారు. అభివృద్ధి పనులపై కోటలో ఎమ్మెల్యే సమీక్షించారు. పల్లె పండుగ పనులపై ఆరా తీశారు. పెండింగ్ పనులు పూర్తి చేయాలని, పాడైపోయిన రోడ్లు, కాలువల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కోరారు.

ఎండియు వ్యవస్థను కొనసాగించాలి

తహశీల్దార్‌కు ఆపరేటర్ల వినతి

ప్రజాశక్తి-వేపాడ

ఎండియు వ్యవస్థను రద్దు చేయొద్దని కోరుతూ ఆపరేటర్లు శుక్రవారం స్థానిక తహశీల్దార్ రాములమ్మకు వినతి అందించారు. గత ప్రభుత్వం తమతో ఆరేళ్ల కొనసాగించేలా ఒప్పందం కుదుర్చుకుందని, ఆ గడువు ముగియక ముందే కూటమి ప్రభుత్వం తొలగించడం సరికాదని పేర్కొన్నారు. దీంతో తమ కుటుంబాలు రోడ్డున పడతాయని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రత్యామ్నాయ మార్గాన్ని చూపించాలని, లేకుంటే తమ కుటుంబాలకు ఆత్మహత్యలే శరణ్యమని వాపోయారు. అందుకు స్పందించిన తహశీల్దార్ సమస్యను జిల్లా అధికారులకు తెలియజేస్తానని హామీనిచ్చారు. వినతినిచ్చిన వారిలో ఎండియు ఆపరేటర్ల యూనియన్ సభ్యులు సతీష్, మహేష్, నానాజీ, సూరిబాబు, శంకర్రావు, కృష్ణమ నాయుడు, రమేష్ ఉన్నారు.



తహశీల్దార్‌కు వినతి అందిస్తున్న ఎండియు ఆపరేటర్లు

చిట్టిబాబుకు జాతీయ అవార్డు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

స్వతంత్ర సమరయోధుడు, భారత రాజ్యాంగ విధాన పరిషత్ సభ్యుడు, నేషనల్ ఫౌండేషన్ ఫర్ ఇండియా వ్యవస్థాపకుడు, భారతరత్న సి. సుబ్రహ్మణ్యం జాతీయ అవార్డు ను న్యూఢిల్లీలోని ఇండియన్ హాబిటేట్ సెంటర్‌లో దళిత బహుజన శ్రామిక యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి చిట్టిబాబు అందుకున్నారు. చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ సత్యానంద్ మిశ్రా, నేషనల్ ఫౌండేషన్ ఫర్ ఇండియా డైరెక్టర్ బిరాజ్ పట్నాయక్, ప్రొఫెసర్ వర్జీనియస్ కాకా , నేషనల్ క్యాంపెయిన్ ఆన్ దళిత్ హ్యూమన్ రైట్స్ జాతీయ జనరల్ సెక్రటరీ బీనా పలికల్, నాక్డోర్ జాతీయ అధ్యక్షుడు అశోక్ భారతి తదితర ప్రముఖులు పాల్గొన్న జాతీయ అవార్డుల ప్రధానోత్సవంలో బీనా పల్లికల్ చేతులమీదుగా అవార్డును చిట్టిబాబు అందుకున్నారు. ఈ సందర్భంగా సత్యానంద మిశ్రా మాట్లాడుతూ ప్రజా చైతన్యమే సమాజ మార్పు కు దారితీస్తుందని , అలా సమాజ మార్పునకు పనిచేస్తున్న వ్యక్తులను , సంస్థలను నేషనల్ ఫౌండేషన్ ఇండియా గుర్తించి, వారికి జాతీయ అవార్డులను అందిస్తోందని తెలిపారు. పౌరుల ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం అనేక విధాలుగా దళిత, ఆదివాసి, మహిళల, బాలల, శ్రామిక వర్గాల కోసం నిరంతరం శ్రమిస్తున్న వ్యక్తులను 14 మందిని గుర్తించామని, వీరి కృషిని గుర్తింపుగా అవార్డు అందజేశామని తెలిపారు. అవార్డు గ్రహీత చిట్టిబాబు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా జరిగిన ఎంపికలో అవకాశం దక్కడం , సి సుబ్రహ్మణ్యం జాతీయ అవార్డు తీసుకోవడం చాలా సంతోషంగా ఉందని, అంతేకాకుండా తనపై ఇంకా బాధ్యత పెరిగిందని తెలియజేశారు.



జాతీయ అవార్డు అందుకుంటున్న చిట్టిబాబు

మాతృత్వం పట్ల గౌరవానికి ప్రతీకగా

ఒయాసిస్ జనని యాత్ర

ప్రజాశక్తి- కంటోన్మెంట్

మాతృత్వం పట్ల గౌరవానికి ప్రతీకగా ఒయాసిస్ జనని యాత్ర కొనసాగుతోందని ఒయాసిస్ ఫెర్టిలిటి సైంటిఫిక్ హెడ్ కృష్ణ చైతన్య రీజనల్ హెడ్ రాధిక పొట్లూరి పేర్కొన్నారు. శుక్రవారం అయోధ్య మైదానంలో ఒయాసిస్ జనని యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో విశ్వసనీయ ఫర్టిలిటి కేర్ చెయిన్ గా పేరు పొందిన ఒయాసిస్ ఫెర్టిలిటీ మే నెలను మదర్స్ మంత్ గా వేడుక చేసుకుంటోందన్నారు.

అందులో భాగంగా మదర్స్ డేని పురస్కరించుకొని, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వ్యాప్తంగా 30 రోజుల పాటు 30 పట్టణాల్లో 'ఒయాసిస్ జనని యాత్ర' పేరిట ఉచిత మొబైల్ ఫర్టిలిటి క్యాంప్ నిర్వహిస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో సంతానోత్పత్తి రేట్లు 1.7కి తగ్గడంతో - భర్తీ పరిమితి 2.1 కంటే చాలా తక్కువగా - వంధ్యత్వం పెరుగుతున్నప్పటికీ తరచుగా విస్మరించే ప్రజారోగ్య సమస్యగా మారిందన్నారు. చాలా కుటుంబాలకు, సంతానోత్పత్తి చికిత్సను పొందడం అంటే సుదూర నగరాలకు ప్రయాణించడం, ఈ ప్రయాణం ఆర్థిక ఒత్తిడిని మాత్రమే కాకుండా భావోద్వేగ రవాణా సవాళ్లను కూడా తెస్తుందని అన్నారు. ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ కష్ణ కుమారి మాట్లాడుతూ, సంతానోత్పత్తి గురించి అవగాహన పరిమితంగా ఉందని అన్నారు. వారికి నమ్మకమైన వైద్య మార్గదర్శకత్వం మరియు మద్దతు అందించడం ద్వారా ఈ అంతరాన్ని తగ్గించడానికి అవకాశం ఉంటుందని తెలిపారు.



జాబ్‌మేళాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

జాబ్‌మేళాను వినియోగించుకోవాలి

ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

ప్రజాశక్తి-కొత్తవలస

నిరుద్యోగ యువత జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి కోరారు. శుక్రవారం కొత్తవలసలోని ప్రగతి డిగ్రీ కళాశాలలో ప్రగతి విద్యాసంస్థల అధినేత వనము శ్రీనివాసరావు అధ్యక్షతన ఎపి నైపుణ్యాభివృద్ధి సంస్థ సహకారంతో జాబ్‌మేళా ఏర్పాటుచేశారు. జాబ్‌మేళాకు 21 కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. 1242 మంది నిరుద్యోగులు పాల్గొన్నారు. అన్ని కంపెనీలలో కలిపి 388 మంది ఉద్యోగాలు సాధించినట్లు కళాశాల డైరెక్టర్ వి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి ఎ.అరుణ , జిల్లా ప్లేస్ మెంట్ అధికారి టి.భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ సత్యారావు స్మారక గ్రంథాలయం ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లా గ్రంథాలయ సేవా సంఘం ఆధ్వర్యంలో కెఎల్ పురంలో గల లక్ష్మి స్కూల్ ఆఫ్ నర్సింగ్ లో విజయనగరం మొట్ట మొదటి గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ రెడ్డి సత్యారావు జ్ఞాపకార్థం గ్రంథాలయాన్ని సంఘం గౌరవ అధ్యక్షులు నాలుగెస్సులరాజు శుక్రవారం ప్రారంభించారు. అనంతరం గ్రంథాలయ సంస్థ కార్యదర్శి లక్ష్మి, సంఘ సభ్యులతో కలిసి రెడ్డి సత్యారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ రెడ్డి సత్యారావు గ్రంథాలయ సంస్థ చైర్మన్ గా విశేష కషి చేసారని అన్నారు. విద్యార్థులంతా గ్రంథాలయంలో వున్న పుస్తకాలను చదవాలని, పుస్తకాలను బహుమతిగా ఇవ్వడం ఇప్పటినుండే అలవాటు చేసుకోవాలని సూచించారు. గ్రంథాలయ ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షులు బి. రామభద్రరాజు పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి లక్ష్మీ, గ్రంథాలయ సంఘం వ్యవస్థాపకులు అబ్దుల్ రవూఫ్, అధ్యక్షులు కె. ఎర్నాయుడు, ఉపాధ్యక్షులు కె. దయానంద్, లక్ష్మి స్కూల్ ఆఫ్ నర్సింగ్ ప్రిన్సిపాల్ వీరాస్వామి, కర్రోతు సత్యం, ప్రియా, విద్యార్థులు పాల్గొన్నారు.



గ్రంథాలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న అతిథులు

రేపు జెవివి జిల్లా మహాసభ


ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 25న జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరుగనున్న జనవిజ్ఞాన వేదిక జిల్లా మహాసభను విజయవంతం చేయాలని ఆసంఘం జిల్లా అధ్యక్షుడు ఎరుకొండ ఆనంద్ విజ్ఞప్తి చేశారు. జిల్లా మహాసభల ఆహ్వాన పత్రికలను శుక్రవారం కంటోన్మెంట్ గురజాడ పాఠశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా శాస్త్రీయ ఉద్యమం కోసం పనిచేస్తున్న జెవివి ప్రజలను శాస్త్ర విజ్ఞానం దిశగా నడిపించేందుకు అనేక చైతన్య కార్యక్రమాలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్య, వైద్యం ప్రజలకు సక్రమంగా అందించే దిశగా ప్రభుత్వంపై ఒత్తిడి చేయడంతో పాటు అనేక సామాజిక సమస్యలపై అలుపెరగని పోరాటం చేయడమే జనవిజ్ఞాన వేదిక లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో నిర్వహించే మహాసభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో జెవివి జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షులు డాక్టర్ ఎంవిఆర్ కృష్ణాజి, జెవివి పూర్వ అధ్యక్షులు అల్లూరి శివవర్మ, సాంస్కతిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గండ్రేటి శ్రీనివాసరావు, నగర అధ్యక్ష,కార్యదర్శులు షిణగం శివాజీ,పి, షణ్ముఖరావు, శీరాపు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

లెప్రసీపై అవగాహన

ప్రజాశక్తి-డెంకాడ

మండలంలోని రఘుమండ గ్రామంలో లెప్రసీపై మోపాడ పిహెచ్‌సి వైద్యాధికారి జికె శరణ్య ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శరణ్య ఆధ్వర్యంలో గ్రామంలో లెప్రసీ సర్వే చేశారు. టిబి రోగులకు ఫుడ్ బాస్కెట్, మందులను అందజేశారు. కార్యక్రమంలో సూరిబాబు, ఎఎన్ఎం పి.రాజేశ్వరి, సుభద్ర, ఆశా కార్యకర్తలు పైడిరాజు, గౌరి, నాయకులు పిల్లా రాజశేఖర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైద్యాధికారి శరణ్య